క్లుప్తంగా

ఉపాధి కూలీలకు పని కల్పించాలి

నందిపేట్: ఉపాధి హామీ కూలీలకు పని కల్పించాలని కోరుతూ శుక్రవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఎంపీడీవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకుడు గంగాధర్ మాట్లాడుతూ.. ఉపాధి కూలీలకు పని కల్పించకపోవడంతో పేదవారు దీన స్థితిలో ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో కె గంగాధర్, దేవన్న తదితరులు పాల్గొన్నారు.

ఫోన్లు అందజేత

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పీఎస్ పరిధిలో బాధితులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ పోలీస్‌స్టేషన్‌లో వారికి శుక్రవారం అందజేశారు. సెల్‌ఫోన్ పోయిన బాధితులు వెంటనే పీఎస్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. పది మంది బాధితులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోయిన ఫోన్లను గుర్తించి బాధితులకు అందించినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మాక్లూర్: మండలంలోని చిన్నాపూర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను బీజేపీ మండల అధ్యక్షురాలు మదారి మమత శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు గంగోనే వినోద్, మదారి రాజేశ్వర్, సచిన్ గ్రామస్తులు పాల్గొన్నారు.

కూరగాయల విక్రయం ప్రారంభం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కూరయగాల మార్కెట్‌లో ఏర్పాటు చేసిన రైతు బజార్‌లో కూరగాయల విక్రయం శుక్రవారం మొదలైంది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రాజు, మున్సిపల్ అధికారులు పరిశీలించారు. ఇప్పటికే కొన్ని మడిగెలు ఉపయోగంలోకి వచ్చాయని, ఇంకా 27 మడిగెలు కేటాయించాల్సి ఉందని, ఆసక్తి కలిగిన వారి కోసం త్వరలోనే టెండర్ ప్రక్రియ ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. అధికారులు శేఖర్, దత్తారెడ్డి, గజనాన్, కూరగయాల విక్రయదారులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడిగా జీవన్‌గౌడ్



ఆర్మూర్‌టౌన్: తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడిగా ఎలుక జీవన్ గౌడ్ నియామకం అయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు తెలంగాణ బీసీ గ్రాడ్యుయేట్స్ ఫోరం చైర్మన్ అబ్బగోని అశోక్‌గౌడ్ నియామకపత్రం అందజేశారు. దశరథ్, ఎల్లోల్ల సురేశ్, రాజేశ్వర్, నాయకులు పాల్గొన్నారు.

రామ్‌రాజ్ కాటన్ షోరూం ప్రారంభం



పెర్కిట్: కాటన్ దుస్తులకు ప్రసిద్ధిగాంచిన రామ్‌రాజ్ కంపెనీ తమ వ్యాపార విస్తరణలో భాగంగా ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో నూతన షోరూంను ఏర్పాటు చేశారు. ఆర్‌ఆర్ ఫౌండేషన్ డైరెక్టర్ పైడి సుచరితరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై షోరూంను శుక్రవారం ప్రారంభించారు. అలాగే శ్రీ దేవి అసోసియేట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ సరస్వతి జ్యోతి ప్రజ్వలన చేయగా మేనేజింగ్ డైరెక్టర్ మురికి సత్యనారాయణ షోరూంలో తొలి కొనుగోలు చేశారు. కార్యక్రమంలో రామ్‌రాజ్ కాటన్ కంపెనీ నిర్వాహకులు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలి



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించే వీర హనుమాన్ శోభాయాత్రను హిందువులు విజయవంతం చేయాలని సభ్యులు కోరారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సాయంత్రం నాలుగు గంటలకు మామిడిపల్లి ఆంజనేయ స్వామి ఆలయం నుంచి ప్రారంభమై శివాజీ చౌరస్తా వరకు శోభాయాత్ర కొనసాగుతుందన్నారు. బొచ్కర్ నిఖిల్, గంగా చరణ్, కొంగి రవి, అజయ్, ప్రేమ్, అభి, ప్రవీణ్, పవన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప జన్మదిన వేడుకలు

సాక్షి నెట్‌వర్క్: అయ్యప్ప స్వామి జన్మదిన వేడుకలను ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని ఆలయాల్లో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

వరండానే దిక్కయింది

- ఎంపీడీవో కార్యాలయ ఏర్పాటుతో సొంత భవనాన్ని కోల్పోయిన మహిళా సంఘాలు
- బయట ఆవరణలో సమావేశాలు నిర్వహించాల్సిన పరిస్థితి



ఎంపీడీవో కార్యాలయం ఎదుట వరండాలో కూర్చున్న మహిళా సంఘాల సభ్యులు

డొంకేశ్వర్: మండల కేంద్రంలోని ఇందిరా భవన్‌లో ఎంపీడీవో కార్యాలయం ఏర్పాటు కావడంతో మహిళా సంఘాలకు నీడ లేకుండా పోయింది. సమావేశాలు నిర్వహించుకోవడానికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. వేరే దిక్కులేక ఎంపీడీవో ఆఫీసు వరండాలోనే కూర్చొని మీటింగ్‌లు నిర్వహిస్తున్నారు. ఎక్కువ మందికి స్థలం లేకపోవడంతో మహిళలు సమావేశాలకు హాజరుకావడం లేదు. మండల కేంద్రంలో రెండు వీవోలు ఉండగా, 74 ఎస్‌హెచ్‌జీ గ్రూపులు ఉన్నాయి. రెగ్యులర్‌గా సమావేశాలు నిర్వహించుకోడానికి 2006లో నాటి ప్రభుత్వం రూ.10లక్షలతో 'ఇందిరా భవన్'ను నిర్మించి ఇచ్చింది. ఇబ్బందుల్లేకుండా ఎస్‌హెచ్‌జీ సమావేశాలు, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించారు. డొంకేశ్వర్ నూతన మండలంగా ఏర్పడడంతో ఎంపీడీవో కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు అధికారులకు అనువైన భవనాలు దొరకలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో ఇందిరా భవన్‌ను తీసుకోవాల్సి వచ్చింది. మహిళా సంఘాల నుంచి కొంత వ్యతిరేకత వచ్చినా అధికారులు వారిని సముదాయించారు. కొత్త బిల్డింగ్ నిర్మించే వరకు ఓపిక పట్టాలని కోరారు. ఇటీవల ఎంపీడీవో ఆఫీసు ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డిని ఎస్‌హెచ్‌జీ మహిళలు కలిశారు. సమావేశాలు పెట్టుకోవడానికి భవనం లేకుండా పోయిందని, వేరే దగ్గర చూయించాలని కోరారు. సానుకూలమైన స్పందన రాకపోవడంతో మహిళలు అసంతృప్తి వ్యక్తం చేశారు.



ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డికి సమస్యను విన్నవిస్తున్న మహిళలు(ఫైల్)

సమస్యను పరిష్కరిస్తాం

మహిళా సంఘాలకు ఇబ్బందులు కలుగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలనేదానిపై ఆలోచన చేస్తున్నాం. ఎంపీడీవో ఆఫీసులోనే మీటింగ్ హాలులో కొంత భాగాన్ని కేటాయించి వేరు చేయాలనుకుంటున్నాం. లేదా వేరే భవనాన్ని చూస్తాం.

– బ్రహ్మానందం, ఎంపీడీవో/మాణిక్యం, ఏపీఎం

ఘనంగా పూలే జయంతి



మోర్తాడ్‌లో పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



ఆర్మూర్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నాయకులు

సాక్షి నెట్‌వర్క్: సామాజిక ఉద్యమ మార్గదర్శి, బహుజన చైతన్య దీప్తి, వివక్షాలపై పోరాడి, మహిళా విద్యకు కృషి చేసిన సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతీబా పూలే జయంతిని ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో శుక్రవారం ఘనంగా జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పలు ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. మోర్తాడ్‌లో జ్యోతిబాపూలే విగ్రహానికి బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమాల్లో ప్రజా సంఘాల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



నందిపేటలో ప్రజాసంఘాల నాయకులు



పెర్కిట్: మచ్చర్లలో నివాళులర్పిస్తున్న గ్రామస్తులు



మాక్లూర్: గుత్పలో



కమ్మర్‌పల్లిలో నివాళులర్పిస్తున్న ఏఐఎస్ నాయకులు



మోర్తాడ్‌లో కాంగ్రెస్ నాయకులు



డొంకేశ్వర్‌లో కాంగ్రెస్ నాయకులు

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



చేపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు



ముప్కాల్: రెంజర్లలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

పెర్కిట్/ బాల్కొండ/ ఆర్మూర్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించారు. ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు శుక్రవారం ప్రారంభించారు. ఆర్మూర్ మండలం చేపూర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురకంటి చిన్నారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో దాసరి శ్రీకాంత్, రామ్‌సన్, ఇందూరు సాయన్న, కుస్తాపురం గంగారెడ్డి, కటికె శ్రీనివాస్, కె వినోద్, ఎస్ రవి, నవీన్, సిందూకర్ అమల, అనిత, సీసీ సాయన్న తదితరులు పాల్గొన్నారు. ముప్కాల్ మండలం రెంజర్లలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ గజనాన్, చైర్మన్ గంగాధర్ ప్రారంభించారు. కార్యక్రమంలో సీఈవో గంగాధర్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు. బాల్కొండ మండల కేంద్రంలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ నాగులపల్లి సురాజ్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి బద్దం లావణ్య, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు. మెండోరా మండలం సావెల్ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, చైర్మన్ మచ్చర్ల రాజారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు. ఆర్మూర్, రాంపూర్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను సొసైటీ అధ్యక్షుడు కాపెల్లి చిన్న ముత్తెన్న, ఉపాధ్యక్షుడు నర్మె నవీన్ ప్రారంభించారు. డైరెక్టర్లు, రైతులు, సంఘం కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్మూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ అధ్యక్షుడు

పోషకాహారంపై అవగాహన



కోస్లీలో చిన్నారులతో సూపర్‌వైజర్

నవీపేట/ వేల్పూర్: నవీపేట మండలంలోని కోస్లీ గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం పోషణ్ పక్వాడ ఉత్సవాలను నిర్వహించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. బాలింతలకు తీసుకునే ఆహారంపై అవగాహన కల్పించారు. అన్న ప్రాసన, అక్షరాభ్యాసం, గ్రాడ్యుయేషన్ ఉత్సవాలు చేపట్టారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. వేల్పూర్ మండలం లక్కోర అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించా రు. గర్భిణులు, బాలింతలకు చిరుధాన్యాలపై ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ ఉషారాణి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలో న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. అధ్యక్షుడిగా జక్కుల శ్రీధర్, ప్రధానకార్యదర్శిగా జెస్సు అనిల్, ఉపాధ్యక్షుడిగా ఆనంద్, సంయుక్త కార్యదర్శిగా మద్దుల గంగారాం, కోశాధికారిగా గజ్జల చైతన్య, గ్రంథాలయ కార్యదర్శిగా కుందారం శ్రావణ్ ఎన్నికయ్యారు. అనంతరం నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ సభ్యులను పలువురు న్యాయవాదులు ఘనంగా సన్మానించారు.

వేల్పూర్‌లో అంబేడ్కర్ యూత్..

వేల్పూర్: వేల్పూర్ మండల కేంద్రంలో అంబేడ్కర్ యూత్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తాల్ల మోహన్‌దాస్, కార్యదర్శిగా సౌడ దాస్, ఉపాధ్యక్షుడుగా సౌడ రవికుమార్, కోశాధికారిగా నీరడి రవిచంద్ర, సంయుక్త కార్యదర్శిగా నీరడి మహేశ్ ఎన్నియ్యారు.

తాళ్లరాంపూర్‌ను సందర్శించిన నిజనిర్ధారణ కమిటీ



తాళ్లరాంపూర్‌లో మాట్లాడుతున్న ప్రతినిధులు

మోర్తాడ్: ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌లో గ్రామాభివృద్ధి కమిటీ, గౌడ సంఘం మధ్య నెలకొన్న వివాదంలో ఇబ్బందిపడుతున్న సామాన్యుల అంశంపై వాస్తవాలను సేకరించడానికి సీపీఐఎంఎల్ మాస్‌లైన్(ప్రజాపంథా) నాయకులు శుక్రవారం పర్యటించారు. శ్రీరామనవమి సందర్భంగా కుంకుమ పూజకు వెళ్లిన మహిళలను వీడీసీ సభ్యులు గెంటివేయగా ఈ అంశంపై విచారణ చేపట్టారు. గౌడ సంఘం, గ్రామ కమిటీ సభ్యుల మధ్య నెలకొన్న వివాదంపై వాస్తవాలను సేకరించారు. గ్రామ కమిటీ ఆగడాలు మితిమీరిపోతున్నాయని దీనిపై కలెక్టర్‌కు నివేదికను అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రభాకర్, దేవారాం, సురేశ్, కిషన్, అశోక్, పవార్, సత్తెక్క, నరేందర్, బాలయ్య పాల్గొన్నారు.

అలరించిన కుస్తీపోటీలు



విజేతకు వెండి కడియం అందిస్తున్న వీడీసీ ప్రతినిధులు

బోధన్‌రూరల్: మండలంలోని పెగడపల్లిలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కుస్తీపోటీలు అలరించాయి. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గ్రామంలో కుస్తీపోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఢిల్లీ నుంచి వచ్చిన బల్జిత్ కౌర్ అనే యువతి పాల్గొని అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఫైనల్ పోటీల్లో మహారాష్ట్రకు చెందిన అవినాశ్ ఢిల్లీకి చెందిన బల్జిత్ కౌర్ పోటీపడగా అవినాశ్ గెలుపొందాడు. అనంతరం అవినాశ్‌కు పది తులాల వెండి కడియం, రెండో స్థానంలో నిలిచిన బల్జిత్ కౌర్‌కు రూ. మూడు వేల నగదు బహుమతిని వీడీసీ చైర్మన్ లక్ష్మారెడ్డి అందించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ రాజారెడ్డి, వీడీసీ ప్రతినిధులు గ్రామ పెద్దలు సంజీవ్, నాగరాజు, అబ్బన్న, పోతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారిని బాగు చేయాలి



గుంతలు పడ్డ ప్రాంతాన్ని చూపుతున్న రైతు

రుద్రూర్: రుద్రూర్ మండలం చిక్కడపల్లి–రాణంపల్లి శివారులోని పొలం రహదారిని బాగు చేయాలని రైతులు కోరుతున్నారు. పదేళ్లుగా ఈ రహదారిని పట్టించుకున్న వారే లేరని వాపోయారు. గుంతలు పడి అధ్వానంగా మారిందని, విత్తనాలు, ఎరువులు తీసుకు రావడంలో, వరి కోత సమయంలో ఇబ్బందులు పడాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పండించిన ధాన్యం తరలించడానికి అవస్థలు పడుతున్నామని తెలిపారు. రోడ్డు సరిగా లేనందున కోత యంత్రాల నిర్వాహకులు అధిక డబ్బులు డిమాండ్ చేస్తున్నారని వాపోయారు. వంద ఎకరాలకు ఉపయోగపడే ఈ దారిని అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని రైతులు కోరుతున్నారు.

పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

- సీపీ సాయి చైతన్య



మాట్లాడుతున్న సీపీ సాయిచైతన్య



బోధన్ పట్టణ పీఎస్‌లో రికార్డులను పరిశీలిస్తున్న సీపీ

బోధన్‌టౌన్: హనుమాన్ జయంతిని ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని సీపీ సాయి చైతన్య సూచించారు. బోధన్ పట్టణంలోని అప్నా పంక్షన్ హాల్‌లో హనుమాన్ ర్యాలీ కమిటీ సభ్యులు, హిందూ సంఘాల సభ్యులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. పట్టణంలో నిర్వహించే ర్యాలీని ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. పోలీసుల పర్యవేక్షణ ఉంటుందని ఎవరైనా ప్రజలకు ఇబ్బందులు కలిగేలా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పట్టణంలో నిర్వహించే ర్యాలీ రూట్‌మ్యాప్‌ను పరిశీలించారు. సమావేశంలో ఏసీపీ శ్రీనివాస్, సీఐలు వెంకట నారాయణ, విజయ్‌బాబు, కృష్ణ, ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్, ఎస్సైలు, ర్యాలీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పటిష్టమైన నిఘాతో గంజాయిని నియంత్రించాలి

బోధన్‌టౌన్: పటిష్టమైన నిఘాతో గంజాయిని నియంత్రించాలని సీపీ సాయి చైతన్య పేర్కొన్నారు. శుక్రవారం బోధన్ పట్టణ పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించారు. రిసప్షన్ సెంటర్, కంప్యూటర్ సెక్షన్ పనితీరును పరిశీలించి సిబ్బందిని పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీపీ వెంట ఏసీపీ శ్రీనివాస్, సీఐ వెంకట నారాయణలు ఉన్నారు.

సంక్షిప్తం

ఉచిత టైలరింగ్ శిక్షణ

రుద్రూర్: కోటగిరి, రుద్రూర్ మండల కేంద్రాల్లో మహిళలకు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా ఉచిత టైలరింగ్ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కోఆర్డినేట్ కొత్తపల్లి రమేశ్ తెలిపారు. కోటగిరి మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో, రుద్రూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ సమీకృత భవన సముదాయంలో శిక్షణ తరగతులు ఉంటాయని వివరించారు. మరిన్ని వివరాలకు 80995 87454 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఉపాధిలో చెరువు పనులను ప్రారంభించాలి

కమ్మర్‌పల్లి: కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన చెరువు పనులు, కాలువ సరిహద్దు పనులను ఉపాధి హామీ పథకంలో తిరిగి ప్రారభించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం, అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శుక్రవారం కమ్మర్‌పల్లి ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. చెరువు, కాలువ పనులను రద్దు చేయడం వల్ల కూలీలకు తీరని అన్యాయం జరుగుతోందని అన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లకు బకాయిలు చెల్లించడంతో పాటు, కూలీలకు మూడు నెలల బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. సారా సురేశ్, అశోక్, రాధ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

వేల్పూర్: మండలంలోని కుకునూర్ అంగన్‌వాడి కేంద్రాన్ని ఎంపీవో సాయిలు శుక్రవారం తనిఖీ చేశారు. పిల్లల హాజరును పరిశీలించారు. మూడేళ్లలోపు పిల్లలంతా సెంటరుకు తప్పనిసరిగా వచ్చేటట్లు చూడాలని స్థానిక అంగన్‌వాడీ టీచర్‌కు సూచించారు.

మాజీ ఎమ్మెల్యే షకీల్‌కు పరామర్శ



బోధన్‌టౌన్: బోధన్ మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ తల్లి మృతి చెందడంతో బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆయనను శుక్రవారం పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ నాయకులు, స్థానికులు ఉన్నారు.

లక్ష్మాపూర్‌లో రైతుల ఆందోళన

వర్ని: చందూరు మండలం లక్ష్మాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఇష్టానుసారంగా ధాన్యాన్ని కాంటా చేస్తున్నారని ఆరోపిస్తూ రైతులు శుక్రవారం లక్ష్మాపూర్ బ్రాంచ్ వద్ద ధర్నా నిర్వహించారు. ముందుగా కోసిన ధాన్యాన్ని కాంటా చేయకుండా పలుకుబడి ఉన్నవారికి, రాజకీయ నాయకులు సిఫారసు చేసిన వారి ధాన్యాన్ని కాంటా చేస్తున్నారని ఆరోపించారు. ఇకపై అలా జరగకుండా చూస్తానని చందూర్ సొసైటీ చైర్మన్ అశోక్ రైతులకు భరోసా ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ముస్లింల నిరసన

రుద్రూర్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బోర్డు బిల్లును వ్యతిరేకిస్తూ శుక్రవారం అక్బర్‌నగర్‌లో ముస్లింలు నిరసన తెలిపారు. కార్యక్రమంలో మజీద్ సదర్ మహమ్మద్, హబీబ్ ఖాన్, అబ్దుల్ రహీం, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గేటును తెరవాలని వినతి

నవీపేట: రైతుల వరికోతలను దృష్టిలో ఉంచుకుని తాత్కాలికంగా దర్యాపూర్ గేటును తెరవాలని వీడీసీ ప్రతినిధులు శుక్రవారం రైల్వే అధికారులు, గుత్తేదారులకు వినతి పత్రం సమర్పించారు. పంట పొలాలు, తాగునీటి బోరుబావుల మోటార్లు, దేవతా విగ్రహాలు గేటుకు అవతి వైపు ఉన్నందున గేటు మూయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని విన్నవించారు. కార్యక్రమంలో వీడీసీ ప్రతినిధులు తెడ్డు పోశెట్టి, దేవరాజ్, హన్మాండ్లు, నరేశ్, సత్యం తదితరులు ఉన్నారు

ముస్తాబైన ఆలయాలు

నందిపేట్/ బాల్కొండ: హనుమాన్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని నందిపేట మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాలను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. సాయంత్రం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు దీక్షాపరులు, హిందూ సంఘాల సభ్యులు తెలిపారు. బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలోని గ్రామాల్లో హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయాలను ముస్తాబు చేశారు. హనుమాన్ శోభాయాత్ర నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఘనంగా హనుమాన్ విగ్రహం ఆవిష్కరణ



బోధన్‌టౌన్: పట్టణంలోని శక్కర్‌నగర్‌లో హనుమాన్ విగ్రహం, వ్యాయామశాల భవనాన్ని కమిటీ ప్రతినిధులు శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ కార్యవాహ దిగంబర్‌జీ, వ్యాయామ శాల కమిటీ ప్రతినిధులు అడ్లూరి శ్రీనివాస్, రేకం దాసు, పెర్క స్వామి, శేఖర్, దాతలు శ్రీనివాస్, ఆదినారాయణ, అర్జున్ రాండర్, కనకరాజు తదితరులు ఉన్నారు.

సినిమాలు

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి (తెలుగు) - 10.00, 1.05, 7.15, 10.20, ఫలక్ నుమా దాస్(తెలుగు)-4.10
స్క్రీన్-2	జాక్(తెలుగు)-10.50, 1.45, 4.40, 7.35, 10.30
స్క్రీన్-3	ద మమ్మీ (తెలుగు)-12.20, 2.50, 5.20, 7.50, 10.20
స్క్రీన్-4	గుడ్‌బ్యాడ్ అగ్లీ (తెలుగు)-10.30, 1.25 7.05, 10.0, మ్యాడ్ స్క్వేడ్(తెలుగు)-4.20



మాంసం ధరలు(రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	93,700	వెండి(కిలో)	98,000
22 క్యారెట్స్	85,562		

– నిజామాబాద్ బిజినెస్